
సాక్షి గుంటూరు

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠ

నాదెండ్ల: తూబాడు గ్రామంలోని పోలేరమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో సోమవారం గ్రామ దేవతలు అంకమ్మ తల్లి, పోర్ల అంకమ్మ తల్లి, పోతురాజు విగ్రహాలను ప్రతిష్ఠించారు.



పశ్చిమ డెల్టాకు నీరు విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి సోమవారం 8 వేల క్యూసెక్కులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది.



నెమలిలో పవిత్రోత్సవాలు

తిరువూరు: నెమలి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారి పవిత్రోత్సవాలను ప్రారంభించారు. వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

ప్రారంభించిన 15 రోజులకే కుంగిన రోడ్డు



పెదకూరపాడు : జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ. కోటి 50 లక్షలతో నిర్మించిన రహదారి ప్రారంభించిన 15 రోజులకే కుంగిపోయింది. జూలై 18వ తేదీన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా ఈ రహదారి ప్రారంభోత్సవం జరిగింది. ఇప్పుడీ రహదారి కంభంపాడు జలాలపురం మధ్య కుంగిపోయింది. నాసిరకం నిర్మాణానికి ఇదొక నిదర్శనంగా నిలిచింది.

గారపాడులో పంచలోహ విగ్రహాలు చోరీ



పెదకూరపాడు: గారపాడు గ్రామంలో ఆదివారం పంచలోహ విగ్రహాలు చోరీకి గురయ్యాయి. ఆలయ అర్చకులు గొట్టుముక్కల ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో పూజల నిర్వహించేందుకు ఆదివారం ఉదయం అర్చకులు తలుపులు తెరవగా స్వామివారి, అమ్మవారి కళ్యాణ పంచలోహ విగ్రహాలు కనిపించలేదు. దక్షిణం వైపు గేటు తాళాలు పగలగొట్టి ఉండటం గమనించి స్థానికులకు, ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. సీఐ పత్తిపాటి సురేష్, ఎస్సై గిరిబాబులు సంఘటన స్థలానికి చేరుకొని సోమవారం విచారించారు. క్లూస్ టీం ద్వారా ఆనవాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సురేష్ తెలిపారు.

నేడు ప్రభుత్వ ఉద్యోగుల ఛాయ్ పే చర్చ



నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ నెల 5వ తేదీన కలెక్టరేట్ ఆవరణలోని క్యాంటీన్ వద్ద 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమం చేపడుతున్నట్టు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంఘం రాష్ట్ర అధ్యక్ష్య, కార్యదర్శులు కే.ఆర్.సూర్యనారాయణ, రమేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు చుక్కా వెంకటేశ్వర్లు, కంపాల వెంకటేశ్వర్లు, షేక్.బాజీ, ఏ.భాగ్యమేరీ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జు సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 586.50 అడుగులకు చేరింది. ఇది 302.9125 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 5,088, ఎడమ కాలువకు 8,280, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 28,664, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 300 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 44,132 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 66,407 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

లక్ష్మీ నృసింహస్వామికి గొలుసు అందజేత



మంగళగిరి: మంగళాద్రిలోని లక్ష్మీనృసింహ స్వామి వారికి విజయవాడకు చెందిన మంద్రు శ్రీనివాస్, భాగ్యశ్రీ దంపతులు రూ.లక్ష విలువైన పింక్ కలర్ రాయి చైన్‌ను బహూకరించారు. అలాగే రాజ్యలక్ష్మి అమ్మవారికి మంగళగిరి పట్టణానికి చెందిన మానుకొండ వీరభద్రరావు, శివపార్వతి దంపతులు రూ. లక్ష విలువైన తిరునామాలను అందజేశారు.

దిక్కుతోచని స్థితిలో రైతన్న

- ఎరువులు లేవు.. విత్తనాలు రావు
- అన్నదాతల పరిస్థితి ఘోరం
- వైఎస్సార్ సీపీ హయాంలో క్రమం తప్పకుండా పథకాల అమలు
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- రైతుల సమస్యలపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం
- పాల్గొన్న పార్టీ నేతలు మోదుగుల, ఎమ్మెల్సీలు కల్పలతా రెడ్డి, మురుగుడు, సమన్వయకర్తలు



కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతున్న అంబటి రాంబాబు, మోదుగుల ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, మురుగుడు, నూరిఫాతిమా, అన్నాబత్తుని, దొంతిరెడ్డి వేమారెడ్డి, అంబటి మురళీకృష్ణ, డైమండ్‌బాబు

గుంటూరు వెస్ట్: దేశానికి వెన్నుముకలాంటి రైతు నేడు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉండడానికి కూటమి ప్రభుత్వమే కారణమని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి అర్జీ అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్తలు అన్నాబత్తుని శివకుమార్, షేక్ నూరి ఫాతిమా, అంబటి మురళీకృష్ణ,



జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు) దొంతిరెడ్డి వేమారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు షేక్ గులాం రసూల్, నిమ్మకాయల రాజ నారాయణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మెట్టు వెంకటప్పారెడ్డి, రాష్ట్ర కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, రాష్ట్ర నాయకులు బైరెడ్డి రవీంద్రారెడ్డి, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు ఆళ్ళ ఉత్తేజ్ రెడ్డి, చిన్నాబత్తిని వినోద్, పవన్ శేషగిరి, దాసరి రాజు, తాడిబోయిన వేణుగోపాలరావు, కె.ప్రేమ్ కుమార్, కార్పొరేటర్లు పడాల సుబ్బారెడ్డి, వెంకట రెడ్డి, ధూపాటి వంశీ, నాయకులు పఠాన్ సైదా ఖాన్, ఎన్.రాజేష్, సీతారామిరెడ్డి, సురసాని వెంకటరెడ్డి, శారద, షేక్ రజియా బేగం పాల్గొన్నారు.

డిమాండ్‌కు తగ్గ సరఫరా ఏదీ? : అంబటి

అంబటి రాంబాబు విలేకరులతో మాట్లాడుతూ రైతులకు నాట్లు వేసుకునే సమయం ఆసన్నమయిందని, ఇటువంటి తరుణంలో వారికి కనీసం యూరియా, విత్తనాలు అందుబాటులో లేవన్నారు. బఫర్ స్టాక్ నిర్వహణా లోపం కారణంగా యూరియా ధర బయట మార్కెట్‌లో రూ.60–100 వరకు వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారన్నారు. యూరియా డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా లేదని, వీటిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. దీనిని అడ్డం పెట్టుకుని సిండికేట్‌లు రైతులను దోచుకుంటున్నారన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కింద గత ఏడాది జూన్ నుంచి ఏడాదికి రూ. 20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం మాటతప్పిందన్నారు.

పంటసాయమంటూ మోసం : ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పుతోందన్నారు. పంటసాయం అందిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. తల్లికి వందనం పేరుతో చాలా మంది అర్హులను తొలగించారని, ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అనేక అర్జీలు వస్తున్నాయన్నారు. ముఖ్యంగా చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కనుచూపు మేరలో కనిపించడంలేదన్నారు.

ఆకాశంలో యూరియా ధర : మోదుగుల

ఒక పక్క రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సంపూర్ణంగా ఎప్పటికి అమలు చేస్తుందో చెప్పాలని మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. యూరియా ధర అందనంత ఎత్తుకు వెళ్లిందని, రైతులు దానిని అందుకోలేని పరిస్థితి తీసుకొచ్చిన కూటమి ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగదన్నారు. జిల్లాలో సుమారు 100 రకాల పంటలను రైతులు పండిస్తున్నారన్నారు. నేడు వీరంతా సాయం కోసం ఆకాశంవైపు చూడాల్సిన పరిస్థితికి తీసుకొచ్చారన్నారు. రైతుల కోసం పోరాటం చేస్తుంటే ఇంత నిర్బంధమేంటన్నారు. రైతు భరోసా కేంద్రాలు ఎంత ప్రజాదరణ పొందాయో కూటమి ప్రభుత్వం అధ్యయనం చేస్తే బాగుంటుదన్నారు.

ఆయన రూటే సపరేటు

- అడిగినంత కప్పం కడితే సజావుగా వ్యాపారం
- లేదంటే ఆబ్కారీ అధికారులతో దాడులు
- బెంబేలెత్తుతున్న మద్యం వ్యాపారులు
- తన దారికి తెచ్చుకునేందుకు దుకాణలపై దాడులు చేయిస్తున్నారంటూ ఆరోపణలు
- మాట వినని వారి షాపుల ముందు ధర్నాలకు ప్లాన్..
- ముందుకు రాని తెలుగు తమ్ముళ్లు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: మద్యం దుకాణాలపై ఆ ప్రజాప్రతినిధికి కోపమొచ్చింది. అడిగినంత ముడుపులు ఇవ్వలేదని గుర్రుగా ఉన్నారు. తన కోపాన్ని నేరుగా ప్రదర్శించలేక, అబ్కారీ అధికారులను అడ్డు పెట్టుకుంటున్నారు. ఏడాదిగా పత్తాలేని నిబంధనల కొరడా ఝుళిపిస్తూ.. కప్పం కట్టని దుకాణదారులను తన దారిలోకి తెచ్చుకునేందుకు పాట్లు పడుతున్నారు. ఒక దశలో ఆయా షాపుల ముందు తమ పార్టీ వారితో ధర్నాలు చేయించాలని ప్లాన్ చేశారు. కిందిస్థాయి నాయకులకు కూడా ఆదేశాలు ఇచ్చేశారు. అయితే ఎమ్మెల్యే మాట విని ప్రభుత్వం కేటాయించిన మద్యం దుకాణాల ముందు ధర్నాలు చేస్తే తాము బుక్ అయిపోతామని గ్రహించిన 'తమ్ముళ్లు' దీనిపై స్పందించకూడదని నిర్ణయం తీసుకున్నారు. కొన్ని రోజులు వేచి చూద్దామంటూ సందేశం పంపారు.

- తొలుత మద్యం దుకాణాల్లో తనకు, తన అనుయాయులకు వాటాలు కావాలని పట్టుబట్టి, బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో కొందరు మాకు ఈ షాపులొద్దు.. ఈ వ్యాపారం వద్దు అంటూ దండాలు పెట్టాల్సి వచ్చింది. అనంతరం కుదిరిన ఒప్పందాల మేరకు మద్యం వ్యాపారులు దుకాణాల వద్దనే టెంట్లు వేసి అనధికారిక సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి వ్యాపారాన్ని సాగిస్తున్నారు.
- ప్రభుత్వం మొదట మద్యం వ్యాపారులకు ఇస్తామన్న 20 శాతం కమీషన్ ఇవ్వకపోగా, దాన్ని తొమ్మిది శాతం, ఆపై పన్నెండు శాతానికి పరిమితం చేయడంతో లాభాలు కూడా రాని పరిస్థితి.
- ఇక ఆ ప్రజాప్రతినిధి ఒక్కో దుకాణం నుంచి కప్పం రూ.5 లక్షలు కట్టాలంటూ ఒత్తిడి తెచ్చారు. వారు మాట వినకపోవడంతో అబ్కారీ అధికారుల ద్వారా రాయ 'బేరం' పంపారు. అయినా దారికి రాలేదు. ఇంతలో మద్యం అసోసియేషన్ పేరుతో రాసిన లేఖతో ముడుపుల వ్యవహారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో విషయం బహిరంగమైంది.
- అసలే వ్యాపారం నష్టాల్లో నడుస్తుంటే ఐదు లక్షలు ముడుపులు ఏమిటని కొందరు వ్యాపారులు అసహనం వ్యక్తం చేశారు. కొందరు మూడు లక్షలు ఇద్దామని సూచించగా, అందుకు కూడా విముఖత చూపారు. ఇక లాభంలేదని ఆ ప్రజాప్రతినిధి ఆబ్కారీ అధికారులను రంగంలోకి దింపారు.

వరుసగా తనిఖీలు.. 'బెల్ట్' పై దాడులు..

ముడుపులు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్న వ్యాపారులు మినహా, మిగిలిన వ్యాపారులను తన దారికి తెచ్చుకునేందుకు ఆ ప్రజాప్రతినిధి దాడులు చేయిస్తున్నారు. గత రెండు రోజులుగా ఆబ్కారీ అధికారులు ఆ నియోజకవర్గ పరిధిలో ఉన్న అధికారిక మద్యం దుకాణాలు, అనధికారిక బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్నారు. గత కొన్ని నెలలుగా గుర్తుకురాని నిబంధనలు ఇప్పుడు అమలు చేయాలని కేసులు నమోదు చేయిస్తుండటం, దుకాణాల పక్కన ఉన్న టెంట్లు తొలగించాలని హుకుం జారీ చేస్తుండటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికీ మాట వినకపోతే తమ నాయకులతో ఆయా షాపుల వద్ద ధర్నాలు చేయించడానికి కూడా ప్లాన్ చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

కోర్టు పరిధి సమస్యలు అక్కడే తేల్చుకోండి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: కోర్టు పరిధిలో ఉన్న సమస్యలు అక్కడే పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ సివిల్ వివాదాల్లో ఉన్న వాటిని తమ వద్దకు తీసుకురావద్దని కోరారు. అదేవిధంగా వ్యక్తిగత కక్షలతో పరిష్కారానికి వీలుకాని అర్జీలు కూడా స్వీకరించమన్నారు. అర్జీల పరిష్కారంలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజలు తమ అర్జీలను స్థానికంగా ఉండే మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయి అధికారులకు ప్రతి వారం ఇవ్వొచ్చన్నారు. దీంతో స్థానికంగా ఉండే ప్రజల సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయన్నారు. అనంతరం వచ్చిన 286 అర్జీలను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్‌ఓ ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

పేదల ఇళ్లపై కక్ష ఎందుకు?



స్థానిక మోతీలాల్ నగర్ ఏర్పడి సుమారు 50 ఏళ్లయింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలవారు అక్కడ నివసిస్తున్నారు. కాలువకు అడ్డుగా ఉన్నాయని 15 ఇళ్లు తొలగిస్తున్నారు. కనీసం సమాచారం కూడా ఇవ్వలేదు. రోజువారీ కూలీ పనులు చేసుకుని జీవించే పేదల ఇళ్లపై ప్రభుత్వానికి ఇంత కక్ష ఎందుకు? తక్షణం అధికారులు ఇళ్లు తొలగించే కార్యక్రమాన్ని విరమించుకోవాలి.

– ఎ.అరుణ్ కుమార్, సీపీఐ నగర కార్యదర్శి

స్వాతంత్ర్య సమరయోధులను గౌరవించండి



తొలి తరం దళిత శాసన సభ్యుడు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మహాత్మా గాంధీ అనుచరుడు తమనంపల్లి అమృతరావు పేరును ప్రతి ఏడాది స్వాతంత్ర్య దిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ సందేశంలో వెల్లడించేవారు. అయితే గత కొన్ని సంవత్సరాల నుంచి ఆయన పేరును ఉచ్ఛరించడంలేదు. స్వాతంత్ర్య సమరయోధులను గౌరవించి, ఆయన పేరును వేడుకల్లో చెప్పాలని కోరుతున్నాం.

– టి.మోహన్ గాంధీ, గాంధీ మిషన్ అధ్యక్షుడు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజతో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. దీనికి సంబంధించి అధికారులు పూర్తి అప్రమత్తతతో ఏర్పాట్లను చూడాలన్నారు. ఈ నెల 15న స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకలకు హాజరు కానున్న అతిథులందరికి ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్‌తోపాటు, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించేలా చేపట్టాలన్నారు. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వెల్లడించే విధంగా వివిధ శాఖల శకటాలు రూపొందించాలన్నారు. స్టాల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసాపత్రాల ప్రతిపాదనలు ఈనెల 7వ తేదీలోపు అందించాలన్నారు.

12న నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నులిపురుగుల నిర్మూలనపై రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డీఆర్‌ఓ ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కుబడి తంతు

బడి బస్సు భద్రమేనా..!

- కనీస తనిఖీలు చేపట్టని ఆర్టీఏ అధికారులు
- ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ ప్రైవేటు సంస్థకు అప్పగింత
- మాన్యువల్ పద్ధతులు ఆర్టీఓ పరిధిలోనే..
- విద్యాసంస్థల బస్సులపై ఈ ఏడాది కేవలం 98 కేసులే
- జిల్లాలో 1600పైగా విద్యాసంస్థల బస్సులు
- మొద్దునిద్ర వీడకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం



పట్నంబజారు: విద్యా సంస్థల బస్సుల భద్రతపై నీలిమేఘాలు కమ్ముకుంటున్నాయి. పూర్తిస్థాయిలో భద్రత లోపభూయిష్టంగా మారిందా..? అనే అనుమానాలు కలుగుతున్నాయి. రవాణాశాఖ అధికారులు పూర్తిస్థాయి పర్యవేక్షణ లేకపోవటం అందుకు కారణం అవుతోందనే వాదనలు వినవస్తున్నాయి. విద్యా సంస్థల బస్సుల ఫిటెనెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ)కి సంబంధించి అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఎఫ్‌సీ జారీ 'ప్రైవేటు'కు

రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) అధికారుల గణాంగాల ప్రకారం.. జిల్లాలో 1600 వరకు విద్యా సంస్థల బస్సులు ఉన్నాయి. గతంలో ఆర్టీఏ అధికారులు పూర్తిస్థాయిలో బస్సులను మ్యానువల్, సెన్సార్‌ల ప్రకారం తనిఖీలు నిర్వహించి ఎఫ్‌సీలు జారీ చేశారు. రూల్ నెంబర్ 185(ఎఫ్) కచ్చితంగా ప్రతి స్కూల్, కళాశాలల యాజమన్యాలు ఎఫ్‌సీలు తీసుకోవటంతో నిబంధనలు పాటించాలని తెలియజేస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎఫ్‌సీ జారీ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ సంస్థకు కట్టబెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో జర్మనీ మిషన్‌లు, సెన్సార్‌ల ప్రకారం.. బస్సుల తనిఖీలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మిషనరీ ద్వారా కొద్దిపాటి తనిఖీలు మాత్రమే జరుగుతున్నాయని తెలుస్తోంది. జిల్లాలో ఇంకా సుమారు 700కుపైగా బస్సులు ఎఫ్‌సీ చేయించాల్సిన అవసరం ఉందని తెలుస్తోంది. దీనిపై పలుమార్లు ఆర్టీఏ, ప్రైవేట్ ఎఫ్‌సీ సంస్థలను వివరాలు అడిగినప్పటికీ ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. అయితే మిషనరీకి సంబంధించినవి మాత్రమే ప్రైవేట్ ఎఫ్‌సీ సెంటర్ నిర్వాహకులు నిర్వహిస్తున్నారని, సుమారు 16 నిబంధనలు మ్యాన్యువల్ ప్రకారం చేయాల్సి ఉందని చెబుతున్నారు. సబ్‌రూల్ 'ఏ', 'బి' ప్రకారం తప్పని సరిగా పాటించాల్సిన మ్యాన్యువల్ పద్ధతులన్నీ అధికారుల పర్యవేక్షణలో కొనసాగాల్సినవే.

నిబంధనలు..

- 60 సంవత్సరాలు వయో పరిమితి దాటిన వ్యక్తి విద్యాసంస్థల బస్సు డ్రైవర్‌గా అనర్హుడు
- డ్రైవర్‌కు హెవీ లైసెన్స్ ఉండి.. ఐదు సంవత్సరాల అనుభవం ఖచ్చితంగా ఉండాలి
- డ్రైవర్‌కు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు ఆయా యాజమాన్యాలు విధిగా చేయించి, ఆ రికార్డులను భద్రపరచాలి.
- డ్రైవర్‌ల నియామకాన్ని ఆర్టీఓ అధికారులకు తెలియపరచాలి
- ప్రతి వాహనంలో ఫిర్యాదు పుస్తకాన్ని ఏర్పాటు చేయాలి. బస్సులో అత్యవసర ద్వారం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరం, బ్యాగులు భద్రపరుచుకునే బాక్సులు ఉండాలి.
- విద్యార్థుల వివరాలను యాజమాన్యాలు నోట్ చేసుకోవటంతో పాటు, తల్లిదండ్రులకు డ్రైవర్ వివరాలు తెలియజేయాలి.
- 15 సంవత్సరాలు దాటిన బస్సులకు అనుమతి ఉండదు.
- డ్రైవర్‌ల ప్రవర్తనపై దృష్టి సారించాలి.
- వీటిలో అనేక అంశాలు ఆర్టీఏ అధికారుల పర్యవేక్షణలోనే కొనసాగాల్సిన అవసరం ఉంది.



విద్యా సంస్థల బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

బడి బస్సులపై కేసులు

సంవత్సరం	కేసులు
2020–21	51
2021–22	545
2022–23	382
2023–24	145
2024–25	98

(జనవరి నుంచి ఇప్పటివరకు)

ఏ పరీక్షలు చేస్తున్నారో మాకు తెలియదు



ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్‌లో ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారో.. మాకు కూడా తెలియదు. ఇప్పటివరకు ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి పర్యవేక్షణ ఆదేశాలు రాలేదు. ఇంతవరకు ఆర్టీఏ అధికారులు ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్‌ను పరిశీలించింది లేదు. దీనిపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేం. బస్సులు నిబంధనలు పాటించకుంటే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– కె.సీతారామిరెడ్డి, డీటీసీ, గుంటూరు జిల్లా

తనిఖీలు తూతూమంత్రం

విద్యా సంస్థల బస్సుల పర్యవేక్షణలో భాగంగా గతంలో అనేక కేసులు నమోదు అయ్యాయి. నిబంధనలు పాటించకుంటే బస్సులు సీజ్ చేసే అధికారం ఆర్టీఏ అధికారులకు ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో అధికారులు మరింతగా బడి బస్సుల భద్రతపై దృష్టి సారించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంతో పోలిస్తే ప్రస్తుతం తనిఖీలు తగ్గిపోయాయి. 2022లో జిల్లావ్యాప్తంగా బస్సులను తనిఖీలు చేసి, నిబంధనలు పాటించనివాటిపై 545 కేసులు నమోదు చేసిన అధికారులు ఈ ఏడాది 98 కేసులు మాత్రమే నమోదు చేయడం వారి పనితీరుకు అద్దం పడుతోంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ముమ్మర తనిఖీలు నిర్వహించి, బడి బస్సుల భద్రతపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,400 గరిష్ఠం : రూ. 2,000

మోడల్ ధర రూ. 1,700

మిర్చి

యార్డు సమాచారం (సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	48,484
అమ్మకాలు	45,996
నిల్వ	6,699

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,500
నంబరు-5	10,000-13,300
273	10,000-12,600
341	10,000-14,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,400
273	10,500-12,800
341	10,000-14,800
4848	10,000-12,700

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,100
బాడిగ-355	10,000 - 12,800
దేవనూరు డీలక్స్	10,000 - 12,500
ఆర్మూర్	9,800 - 11,000
తాలుకాయలు	5,000 - 7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,800
బాడిగ - 355	10,000-12,200
తాలు	5,300 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)



పసుపు ధరలు

(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 140

కొమ్ములు : 70 బస్తాలు

కనిష్ఠ :	(ధర రూ॥ల్లో) గరిష్ఠ :	మోడల్ :
9,225	10,000	9,225

కాయలు : 70 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,500	10,561	10,150

మొత్తం అమ్మకాలు : 105.000 క్వింటాళ్లు

-దుగ్గిరాల

చిట్టీల పేరుతో మోసగించారు

- జిల్లా ఎస్పీకి బాధితుల ఫిర్యాదు
- నిర్ణీత వేళల్లో సమస్యలు పరిష్కరించాలని ఆదేశం



వృద్ధుడితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: చిట్టీల పేరుతో మోసగించారంటూ కొందరు...అపహరణకు గురైన నగలు, నగదుపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మరికొందరు సోమవారం నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. అర్జీదారుల నుంచి అర్జీలను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్వీకరించారు. బాధితుల మొర ఆలకించారు. ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత పోలీస్ అధికారులతో మొబైల్ ఫోన్‌లో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చే ఫిర్యాదులను నిర్ణీత వేళల్లో పరిష్కరించాలని ఆదేశించారు. చట్టపరంగా విచారించి, బాధితులకు పరిష్కారం చూపాలని చెప్పారు. జిల్లా ఏఎస్పీలు రవికుమార్ (ఎల్/ఓ), హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి (మహిళా పీఎస్), అరవింద్ (పశ్చిమ) కూడా అర్జీలు స్వీకరించారు.

పోస్టాఫీస్‌లో ఉద్యోగమని..

సుమారు రెండేళ్ల కిందట ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. పోస్టాఫీస్‌లో ఎంటీఎస్ ఉద్యోగాల నోటిఫికేషన్ వచ్చిందని చెప్పారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు బాగా తెలుసునని, ఊరికి దగ్గర్లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. అడ్వాన్స్‌గా ఫోన్ పే ద్వారా రూ.2 లక్షలు చెల్లించాను. మిగతా రూ.4 లక్షలు ఉద్యోగంలో చేరాక ఇవ్వాలని బదులిచ్చాడు. ఇరవై లేదా 30 రోజుల్లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఈలోగా ఓ నియామక లెటర్ పంపించగా, ఆ లెటర్ పోస్టాఫీస్‌లో చూపించగా, నకిలీ అని తేల్చారు. దీనిపై అతన్ని నిలదీయగా, మోసగించినట్లు ఒప్పుకున్నాడు. అప్పట్నించి డబ్బులు అడిగితే సరైన సమాధానంలేదు. అప్పు చేయగా వచ్చిన డబ్బులు అతనికి చెల్లించాను. – ఎస్.వెంకటరెడ్డి, సంగడిగుంట.

హోటల్ యాజమాని మోసం..

మూడేళ్ల కిందట ఓ ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేందుకు వచ్చాం. ఈ క్రమంలో అరండల్‌పేటలోని ఓ లాడ్జి/హోటల్‌లో ఉంటూ, ఆసుపత్రికి వెళ్లేవాళ్లం. దీంతో అక్కడ మేనేజర్ పరిచయమయ్యారు. అయితే తమ లగేజీలో దాచిన 240 గ్రాముల బంగారం, రూ.2.50 లక్షలు అపహరించారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాం. దొంగిలించిన వ్యక్తి మేనేజర్ అని పోలీసుల దృష్టికి తీసుకెళ్లాం. అప్పటి నుంచి మేనేజర్‌ని పిలిపిస్తామని కాలయాపన చేశారు. ఇప్పటికై నా అతన్ని పిలిచి, తమకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

– వై.కనకదుర్గ, కొరిటెపాడు.

తల్లి ఆచూకీ గుర్తించండి..

గత నెల 30న ఇంటి నుంచి తల్లి మణెమ్మ వెళ్లిపోయింది. నగర పరిసరాల్లో వెదికినా అమ్మ ఆచూకీ తెలియరాలేదు. ఇటీవల ఆర్టీసీ బస్టాండ్ సమీపాన ఓ సిటీ బస్‌లో ప్రయాణించినట్లు తెలిసింది. అనారోగ్య సమస్యలతో బాధపడుతుందని, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఇప్పటికైనా తల్లి ఆచూకీ గుర్తించాలని కోరుతున్నా.

– కుమారుడు శ్రీనివాస్, మూడో వీధి, రాజీవ్‌గాంధీనగర్,

తెలిసిన వారే చోరీ చేశారు.

ఈ ఏడాది జనవరిలో ఇంట్లోని బీరువాలో ఉన్న 150 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షలు దొంగలించారు. నగదు, నగలను తెలిసిన వారే తస్కరించారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాం. అనుమానితులను పోలీస్‌స్టేషన్‌కు పిలిచి, విచారణ చేసి పంపించారు. లోతుగా విచారణ చేపట్టడంలేదు. ఎఫ్ఐఆర్ నమోదు చేసినా కేసు ముందుకు సాగడంలేదు. దాదాపు ఎనిమిది నెలలుగా పోలీసుల చుట్టూ తిరుగుతున్నా తమకు న్యాయం జరగడంలేదు.

– షేక్.నమాజ్, నందులపేట, తెనాలి.

పదేళ్లుగా నమ్మకంగా ఉంటూ..



స్థానికంగా నివసించే ఓ కుటుంబం పదేళ్లుగా చిట్టీలు నిర్వహిస్తోంది. అందరితో కలసిమెలసి ఉండే వారు. రూ.2 లక్షలు, రూ.3 లక్షల చిట్టీలు వేసేవారు. దీంతో వారి వద్ద చిట్టీలు వేయగా, చిట్టీ పాటలు ముగిసినా కూడా డబ్బులు చెల్లించడంలేదు. అంతేగాక డ్వాక్రా గ్రూప్ ద్వారా ప్రత్యేక రుణం తీసుకుని వాయిదాలు చెల్లించలేదు. మూడు వారాలుగా చిట్టీ నిర్వాహకులు కానరావడం లేదు. అదేమని అడిగితే పొంతలేని సమాధానాలు చెబుతున్నారు. దాదాపు 30 మందికి పైగా బాధితులు ఉన్నారు. సుమారు రూ.2.50 కోట్ల వరకు రావాల్సి ఉంది. ఆర్థిక అవసరాల దృష్ట్యా అప్పులు తీసుకు వచ్చి, నెలనెలా చిట్టీల రూపేణా వారికి చెల్లించాం. న్యాయం చేయగలరు.

– బాధితులు, నెహ్రూనగర్

కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ




సింగయ్య కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల నగదు అందజేస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్

- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి
- సింగయ్య కుటుంబానికి రూ.5 లక్షలు అందజేసిన బలసాని

గుంటూరు రూరల్: కార్యకర్తలకు అండగా నిలవడంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు కార్యకర్తల సంక్షేమం కూడా పార్టీకి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రెంటపాళ్ల పర్యటన నేపథ్యంలో ఏటుకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంగళాయపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సింగయ్య కుటుంబాన్ని ప్రత్తిపాడు నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్, జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు తదిదర నేతలతో కలిసి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి సోమవారం పరామర్శించారు. బలసాని కిరణ్ కుమార్ వ్యక్తిగతంగా సింగయ్య కుటుంబానికి రూ.5 లక్షల నగదును అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి సింగయ్య పార్టీలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. పార్టీ నిర్వహించిన ప్రతి కార్యక్రమంలో భాగస్వామి అయ్యేవారన్నారు. సింగయ్య కుటుంబ సభ్యులకు పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే వైఎస్ జగన్ ఆదేశాల మేరకు పార్టీ తరఫున సింగయ్య కుటుంబానికి రూ.10 లక్షలు అందజేసిన సంగతి అందరికీ తెలిసిందేనని తెలిపారు. తాజాగా బలసాని కిరణ్‌కుమార్ రూ.5 లక్షలు అందజేశారని తెలిపారు. బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆలోచనా విధానానికి అనుగుణంగా నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలను సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే సింగయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మందపాటి శేషగిరిరావు, మెట్టు వెంకటప్పారెడ్డి, దుగ్గెంపూడి యోగీశ్వరరెడ్డి, కార్పొరేటర్ పాపతోటి అంబేద్కర్, వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, కలిశెట్టి వెంకటరావు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ లారాలో బీటెక్ ఫస్టియర్ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న విజ్ఞాన్ వర్సిటీ చైర్మన్ లావు రత్తయ్య, వేదికపై సీఈవో డాక్టర్ మేఘన

చేబ్రోలు: విద్యార్థుల జీవితాల్లో సంతోషం, బాధ, కష్టాలు, నష్టాలు, ఒడుదొడుకులు అన్నీ ఉండాలని... అప్పుడే వారు ఉన్నతంగా ఎదుగుతారని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నుంచి బీటెక్ మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ ఈఏపీ సెట్ కౌన్సెలింగ్‌లో సీటు పొందిన విద్యార్థులను, చేర్పించిన తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థులకు నిరంతరం నేర్చుకోవాలనే తపన ఉండాలన్నారు. తల్లిదండ్రులందరూ మీ పిల్లలను బాగా ప్రోత్సహించినట్టయితే వారు ఆరోగ్యంగా, మానసికంగా, సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతారన్నారు. విజ్ఞాన్ యూనివర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి మాట్లాడుతూ తమ కళాశాలలో పనిచేసే అధ్యాపకులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న టెక్నాలజీలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం వలన నూటికి నూరు శాతం ఫలితాలను సాధిస్తున్నామన్నారు. అనంతరం మొదటి సంవత్సరం విద్యార్థులకు రెండు వారాల పాటు ప్రత్యేకంగా నిర్వహించే ఇండక్షన్ ప్రోగ్రామ్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ కే.ఫణీంద్రకుమార్, డీన్లు, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్: పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజినీరింగ్, ఎంబీఏ ప్రథమ సంవత్సరం తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విజ్ఞాన్ నిరుల బాలికలను శక్తివంతమైన యువతగా మేధోవంతులైన యువ ఇంజనీర్లుగా తీర్చిదిద్దుతూ, వారి శారీరక మానసిక వికాసానికి అనువైన వాతావరణంలో తరగతులు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ. రాధిక, అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతో దగా పడుతున్న పొగాకు రైతులు

- రేపు వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా
- ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్



పొగాకు రైతులతో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ప్రత్తిపాడు: ప్రభుత్వ వైఫల్యంతో పొగాకు రైతులు అడుగడుగునా దగా పడుతున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యం వలన దగా పడుతున్న పొగాకు రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6వ తేదీన గుంటూరులోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నారు. ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ రైతు సంఘం నాయకులు సోమవారం ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో పర్యటించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో అత్యధికంగా రైతులు పొగాకు పంటను సాగుచేశారని, అయినా సరిపడినన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఆయా మండలాల్లో భారీ వర్షాలతో పొగాకు పంటను కాపాడుకోలేక, అమ్ముకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. గ్రామాల్లో పొగాకు అమ్ముడుపోక, నిల్వలు పేరుకుపోవడంతో సన్న, చిన్నకారు, కౌలు రైతులు గత ఏడాది కౌలు చెల్లించలేక, ఈ సంవత్సరం సాగుకు పెట్టుబడి లేక, కుటుంబ పోషణ చేయలేక, బతికే పరిస్థితులు కానరాక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లిన పొగాకులో ముప్పై శాతం మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, 70 శాతం వెనక్కి పంపుతున్నారన్నారు. ధర్నాకు రైతులు, కౌలు రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. వెంట రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డ హక్కు

మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎస్.జయలక్ష్మి



మాట్లాడుతున్న ఎస్.జయలక్ష్మి

ప్రత్తిపాడు: తల్లిపాలు బిడ్డ హక్కు అని మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎస్. జయలక్ష్మి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా సోమవారం గుంటూరు రూరల్ మండలం ఓబులనాయుడు పాలెం-2 అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎస్.జయలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు శిశువు జీవితానికి రక్షణ అని, ఆరోగ్య భవితకు బలమైన పునాదని చెప్పారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డతో పాటు తల్లికి కూడా శారీరక, మానసిక దృఢత్వం లభిస్తుందన్నారు. తదనంతరం కేంద్రంలో ప్రీస్కూల్ నిర్వహణ, రిజిస్టర్లును పరిశీలించారు. కార్యక్రమంలో సీడీపీవో జి. విజయలక్ష్మి, ఏసీ డీపీవో సీహెచ్. విజయనిర్మల, సూపర్‌వైజర్లు ఎం.వీ రత్నం, ఎంఎల్‌హెచ్‌పి మేఘన, ఎంఎస్‌కె బి. సుశీల, అంగన్‌వాడీ కార్యకర్త నాగశ్రీ, తల్లులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు మండలంలో..

ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మండల స్థాయి అధికారులకు ఐసీడీఎస్ సిబ్బంది తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. తహసీల్దార్ సుజాత, ఎంఈవో సీహెచ్. రమాదేవి, ఈవోపీఆర్డీ షేక్ ఆదంషఫీ, ఏవో సుగుణబేగంతో పాటు ఆయా శాఖల అధికారులు తల్లిపాల ఆవశ్యతను వివరించే కరపత్రాలు పోస్టర్లును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ కె.వి.ఏ.ఎస్ నందకిషోర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భారతి, పి. మాధవి తదితరులు పాల్గొన్నారు.

పీ-4 కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



తల్లిపాలు అవగాహనా పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అండగా నిలిచేందుకు ప్రారంభించిన పీ-4 పథకాన్ని అధికారులు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మినీ మందిరంలో నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాల మేరకు బంగారు కుటుంబాలను మార్గదర్శకులతో మ్యాపింగ్ చేసే ప్రక్రియ అధికారులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తించిన బంగారు కుటుంబాలతోపాటు, ప్రొఫెషనల్, అసోసియేషన్‌లు, వ్యాపార సంస్థలు, కేటగిరిల్లో మార్గదర్శకలు దత్తత తీసుకునేలా చూడాలన్నారు. పీ-4 నీడ్ అసెస్మెంట్ సర్వేను ఈనెల 7 నాటికి పూర్తి చేయాలన్నారు. లే-అవుట్ లలో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఇతర మార్గాల ద్వారా నిధులు సమకూర్చుకున్నవారు ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం పనుల ప్రతిపాదనలు వారం చివరి నాటికి అందించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని ఐటీఐ, జూనియర్, ఇంటర్ విద్యార్హత ఉన్నవారి హోం వర్క్ సర్వేను పూర్తి చేయాలన్నారు. తల్లికి వందనం పథకంలో లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్ ఈకేవైసీ పెండింగ్ ఉన్నవి వెంటనే పూర్తి చేయాలన్నారు.

పసిబిడ్డలకు తల్లిపాలు శ్రేష్టం

గుంటూరు వెస్ట్ : పుట్టిన బిడ్డలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని, మాతృమూర్తులు ఈ విషయంపై శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, కిమ్స్ శిఖర ఆసుపత్రి సంయుక్తంగా రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతంలా పనిచేస్తాయన్నారు. నేటి చిన్నారులకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించాలంటే పుట్టినప్పటి నుంచే జాగ్రత్తలు వహించాలన్నారు. అనంతరం తల్లులకు కిట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో , కిమ్స్ శిఖర ఆసుపత్రి యూనిట్ హెడ్ డాక్టర్ ఎస్‌వి. హరికుమార్, వైద్యులు పాల్గొన్నారు.

చిన్నారులపై అసభ్య ప్రవర్తన

ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

తాడేపల్లిరూరల్ : పెనుమాకలో నివాసం ఉండే ఓ వ్యక్తి బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంఘటనపై పోలీసులు సోమవారం పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. బుక్కా వీరయ్య అనే వ్యక్తి ఆ ప్రాంతంలో వున్న 9, 10 సంవత్సరాల బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించి, ముళ్ల పొదల్లోకి తీసుకువెళుతున్నాడు. ఆదివారం కూడా ఒక బాలికను ఇదేవిధంగా చేయడంతో గమనించిన తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

10న ఏపీ ర్యాంకింగ్ చెస్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఏపీ రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ పోటీలు ఈ నెల 10వ తేదీన లాంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో నిర్వహిస్తామని నైట్స్ క్యాజిల్ చెస్ అకాడమీ డైరెక్టర్ వై.జాహ్నవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-6, 8, 10, 12, 14, 16 బాలబాలికల విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనే చిన్నారులు ఈ నెల 8వ తేదీ సాయంత్రం లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మొదటి 10 స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. వివరాలకు 90631 42105 నెంబరులో సంప్రదించాలన్నారు.

పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులు కీలకం

రాష్ట్ర పాఠశాలల పరిశీలన బృందం సభ్యుడు రమేష్



పర్చూరు(చినగంజాం): పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులు భాగస్వామ్యులు కావాలని రాష్ట్ర పాఠశాలల పరిశీలన బృందం సభ్యుడు, డైట్ లెక్చరర్ పీ రమేష్ అన్నారు. పర్చూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పాఠశాలల్లో విద్యాభివృద్ధి పరిశీలనలో భాగంగా ఆయన సోమవారం సందర్శించారు. పాఠశాలలో వివిధ తరగతులు అభివృద్ధి, పాఠశాలలోని రికార్డుల నిర్వాహణ, అకడమిక్ అంశాలు, పిల్లల హాజరు, వారిలో విద్యాభివృద్ధి, పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజనం అమలు, అందుకు సంబంధించిన వివిధ అంశాలను పరిశీలించారు. ముందుగా ఆయన పాఠశాల ప్రార్థనా సమయానికి వచ్చి పిల్లలు యూనిఫాం నిర్వాహణ, క్రమశిక్షణ అమలు తీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో ఆయన స్వయంగా భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. 1వ తరగతి నుంచి మొదలుకొని అన్ని తరగతులను పరిశీలించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులకు వివిధ సూచనలు చేశారు. భవిష్యత్‌లో పాఠశాలను సందర్శిస్తామని విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను మెరుగు పరచుకునేందుకు చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 ఏ. శివ కోటేశ్వరరావు, ఎంఈఓ-2 పీ. వెంకటరామయ్య, పాఠశాల హెచ్ఎం ఎం. నాగిరెడ్డి, పీ. నాగమణి, సీఆర్ఎంటీలు ఏ. ఉమావెంకట మహేశ్వరరావు, సాయికుమార్ పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

పీజీ 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో ఏప్రిల్ నెలలో జరిగిన పీజీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ సోమవారం తెలిపారు. ఎంఏ తెలుగు, సంస్కృతం, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, హాస్పిటల్ మేనేజ్మెంట్, ఎంబీఏ టీటీఎం జిల్లా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. రీవాల్యుయేషన్‌కు ఈనెల 13వ తేదీ లోపు ఒక్కొక్క పేపర్‌కు రూ.1860లు చొప్పున చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిరాక్స్ కాపీల కోసం రూ.2190లు చెల్లించాలని ఆయన సూచించారు.

బాలికను వేధిస్తున్న వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

తెనాలిరూరల్: ఇంటర్ చదువుతున్న బాలికను వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన 15 ఏళ్ల బాలిక ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. బాలిక కళాశాలకు వెళ్లి వచ్చేటప్పుడు, చినరావూరుకు చెందిన యువకుడు విజయ్ వేధిస్తున్నాడు. ఈ విషయమై బాలిక తల్లిదండ్రులకు తెలియజేయగా వారి సహాయంతో వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు పోలీసులు సోమవారం తెలిపారు.

కౌలు రైతులకు 'సుఖీభవ' వర్తింప చేయాలి

కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.హరిబాబు



మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.హరిబాబు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాష్ట్రంలో 60 నుండి 70 శాతం భూమిని కౌలురైతులే సాగుచేస్తున్నారని, వీరికి గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని సంఘం జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలంటే భూ యజమాని సంతకం కావాలనే నిబంధన వల్ల గుర్తింపు కార్డులు పొందలేకపోతున్నారన్నారు. ఒక వైపు అధికారులు సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవాలని ప్రచారం చేస్తున్నా ఆచరణలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు ఇవ్వడంలో పాలకపార్టీలు విఫలమయ్యాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని లేనిచో ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ దుగ్గిరాల మండలం చిన కొండూరు లంకభూముల రైతులకు వ్యక్తిగత పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ జిల్లాలో సుమారు లక్ష మంది కౌలు రైతులున్నారని, వీరికి గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో లీడ్ బ్యాంక్ రూ.170 కోట్లు కౌలు రైతులకు రుణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నా ఆచరణలో అమలు చేయడం లేదని, కౌలు రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. జిల్లాలో నల్లబర్లీ పొగాకు కొనగోలు కేంద్రాలు పెంచి రైతుల వద్ద ఉన్న మొత్తం పొగాకు కొనగోలు చేయాలని కోరారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు అందుబాటులో వుంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు ఎం.సాంబిరెడ్డి, పి.కృష్ణ, అమ్మిరెడ్డి, వై.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.